

సంస్కరణలతో ప్రభుత్వ విద్యారంగానికి నష్టం

రణస్థలం : సంస్కరణలు ప్రభుత్వ విద్యారంగానికి నష్టదాయకమని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంఇఒ కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏదైనా సంస్కరణ అంటే మంచి కోసం అమలు చేయాలన్నారు. ఇందుకు భిన్నంగా పాఠశాల సంఖ్య కుదింపు, ఉపాధ్యాయుల సంఖ్య తగ్గింపు, ఉపాధ్యాయులపై పని ఒత్తిడిని పెంచడం ద్వారా విద్యారంగంలో సంస్కరణలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. 117 జిఒతో సుమారు 25 వేల ఉపాధ్యాయ పోస్టులు కనుమరుగయ్యాయని తెలిపారు. 4,600కు పైగా ప్రాథమిక పాఠశాలలు విలీనం అయ్యాయని, 14,200 ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయని చెప్పారు. ఇదే విధానాలు అమలైతే భవిష్యత్‌లో ప్రాథమిక పాఠశాలలు కనుమరుగవుతాయన్నారు. ఈ సంవత్సరం మూడున్నర లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలను వదిలి బయటకు వెళ్లినట్లుగా గణాంకాలు చెప్తున్నాయన్నారు.

మహాధర్నా భగ్నం

- మూలపేటకు వెళ్లనీయకుండా అడ్డగింత
- అఖిలపక్ష నాయకుల గృహ నిర్బంధం
- ప్రజా, కార్మిక, రైతుసంఘాల నాయకులూ హౌస్ అరెస్టు
- ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం : సిపిఎం
- ప్రజాస్వామ్యం ఖూనీ చేశారు : ఎమ్మెల్యే అశోక్


గోవిందరావును హౌస్ అరెస్టు చేసిన పోలీసు


కవిటి : ఎమ్మెల్యే అశోక్‌ను గృహ నిర్బంధం చేసిన పోలీసులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం, నౌపడ, కవిటి, పలాస, టెక్కలి రూరల్

సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు నిర్వాసితుల సమస్యలపై అఖిలపక్షాల మహాధర్నాను పోలీసులు భగ్నం చేశారు. పోర్టు ప్రాంతానికి బయలుదేరుతున్న అఖిలపక్ష నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. నిర్వాసితుల సమస్యలపై మహాధర్నాకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ముఖ్య నాయకులు, ప్రజా, కార్మిక, రైతుసంఘాల నాయకులను గృహ నిర్బంధం చేశారు. మూలపేట పోర్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకుండా శాంతియుతంగా ధర్నాకు వెళ్తున్న నాయకులను హౌస్ అరెస్టులకు పాల్పడటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అఖిలపక్ష నాయకులను గృహ నిర్బంధించడాన్ని పలు ప్రజా కార్మిక, రైతుసంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావును శ్రీకాకుళం నగరంలోని ఆయన నివాసంలో, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తిని పాత్రునివలసలో గృహ నిర్బంధం చేశారు. కవిటిలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను హౌస్ అరెస్టు చేశారు. సంతబొమ్మాళి మండలం ఇజ్జువరంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పేడాడ పరమేశ్వరరావు, సిపిఎం, ప్రజా, కార్మిక, రైతుసంఘాల నాయకులు కె.మోహనరావు, కె.శ్రీనివాసు, కె.నాగమణి, నంబూరు షణ్ముఖరావు, యుగంధర్, ఎస్.సింహాచలం, కె.గన్నయ్య, కె.అప్పలనాయుడు తదితరులను గృహ నిర్బంధం చేశారు. పలాసలో సిపిఐ నాయకులు చాపర వేణుగోపాల్, గోరు వాసుదేవరావుకు నోటీసు ఇచ్చి కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వరకు స్టేషన్‌లో ఉంచి సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు. సాయంత్రం వరకు మూలపేట ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి వెళ్లే ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం : సిపిఎం

మూలపేట పోర్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం పోర్టు పనులు చేపట్టడం అన్యాయమని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అన్నారు. సమస్యలను పరిష్కరించాలని శాంతియుతంగా ధర్నా చేపట్టేందుకు వెళ్తున్న తమను గృహ నిర్బంధించడం దుర్మార్గమన్నారు. నిర్వాసితుల సమస్యల పరిష్కరించని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు : బెందాళం అశోక్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ విమర్శించారు. రాష్ట్రంలో నియంతృత్వ వ్యవస్థ రాజ్యమేలుతోందన్నారు. ఇటువంటి గృహ నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను నిలువరించలేరని హెచ్చరించారు.

గృహ నిర్బంధాలతో ఆపలేరు : కాంగ్రెస్

ప్రజల సమస్యలపై పోరాటం చేస్తున్న తమను గృహ నిర్బంధించడం సరికాదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పేడాడ పరమేశ్వరరావు అన్నారు. గృహ నిర్బంధాలతో పోరాటాలను ఆపలేరన్నారు.

అక్రమ గృహ నిర్బంధాలకు ఖండన

అఖిలపక్ష నాయకులను అక్రమంగా గృహ నిర్బంధించడాన్ని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.రమణారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిర్ల ప్రసాదరావు, జి.సింహాచలం, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి పోలాకి ప్రసాదరావు, మధ్యాహ్న భోజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి తీవ్రంగా ఖండించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

భూములకు మెరుగైన పరిహారం

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మూలపేట పోర్టు అనుసంధాన రోడ్డుకు భూములు ఇచ్చిన రైతులకు మెరుగైన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి నెగోసియేషన్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంతబొమ్మాళి మండలం బన్నువాడ, మోదుగువలస, వేములవాడ రైతులకు సరైన ధర దక్కేలా చూస్తామని చెప్పారు. పరిహారానికి సంబంధించి గత రికార్డులను పరిశీలించి తగు న్యాయం చేస్తామని హామీనిచ్చారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ రైతులకు కావాల్సిన ధర ఇచ్చేందుకు చట్టపరమైన సమస్యలు ఉన్నాయన్నారు.

బన్నువాడ, మోదుగువలస, వేములవాడ నుంచి మూలపేట పోర్టు రహదారికి అవసరమైన 63.62 ఎకరాల భూమి సేకరించేందుకు రైతులు, మహిళలతో ఇప్పటికే ధరపై చర్చించినట్లు వివరించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ రహదారికి అవసరమైన భూముల వివరాలు, మూడేళ్లుగా ఉన్న భూ విలువలను తెలిపారు. వేములవాడకు చెందిన ఒక రైతు మాట్లాడుతూ తమ భూములు మంచి పంటలు పండే భూములని, ఆలోచించి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతిరావు, టెక్కలి తహశీల్దార్ ప్రవళ్లికాప్రియ, మూడు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షలో 8,721 ఒపి నమోదు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో 29 గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో 8,721 ఒపి నమోదైందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో మహిళలు 5,150 మంది కాగా 3,571 మంది పురుషులు ఉన్నారని పేర్కొన్నారు. ఆరోగ్య పరీక్షల అనంతరం 311 మందికి మెరుగైన వైద్యం కోసం ఆయా ఆస్పత్రులకు రిఫర్ చేసినట్లు తెలిపారు. అనారోగ్య సమస్యలున్న 8,514 మందికి ఉచితంగా మందులు అందించినట్లు పేర్కొన్నారు.

గ్రేవ్ కేసుల్లో సమగ్ర దర్యాప్తు

ఎస్‌పి జి.ఆర్ రాధిక



సమావేశం నిర్వహిస్తున్న ఎస్‌పి రాధిక

శ్రీకాకుళం : గ్రేవ్ కేసుల్లో సమగ్రమైన దర్యాప్తు చేపట్టి పురోగతి సాధించాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లాలో నమోదైన గ్రేవ్ కేసులైన ప్రాపర్టీ, హత్య, అత్యాచార, ఎస్‌సి, ఎస్‌టి, పోక్సో తదితర కేసుల దర్యాప్తు, ఆస్తి సంబంధిత నేరాల్లో ప్రాపర్టీ రికవరీ, నిందితుల అరెస్టుపై సర్కిల్ వారీ పోలీసు అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాధాన్యతా కేసులపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. అపరిష్కృతంగా ఉన్న తీవ్రమైన నేరాల్లో సమగ్ర దర్యాప్తుతో కేసుల్లో పురోగతి సాధించి పరిష్కరించాలని ఆదేశించారు. నార్కో డ్రగ్స్ కేసుల్లో కచ్చితమైన ఆధారాలతో దర్యాప్తు చేయాలన్నారు. కేసుల ఛేదింపునకు, పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దర్యాప్తు వేగవంతం చేసి కోర్టులో అభియోగ పత్రాలు వీలైనంత వేగంగా దాఖలు చేయాలని సూచించారు. ఎస్‌సి, ఎస్‌టి కేసుల్లో దర్యాప్తు, కేసు ఫైల్ నిర్వహణ, సాక్షుల విచారణ చేయించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. నైట్ బీట్స్‌ను బలోపేతం చేసి అధికారులు తరచుగా తనిఖీలు చేయాలని చెప్పారు. సమావేశంలో ఎస్‌ఇబి జెడి ఎం.నాగమణికంఠ, ఎఎస్‌పిలు టి.పి విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డిఎస్‌పిలు డి.బాలచంద్రారెడ్డి, వై.శృతి, నాగేశ్వర్‌రెడ్డి, ఎస్.బాలరాజు, ప్రసాదరావు, సిఐలు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలి

పోలీస్ సిబ్బంది ప్రతిఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని ఎస్‌పి రాధిక అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్డ్ రిజర్వు పోలీస్ మైదానంలో పోలీసు సిబ్బంది నిర్వహించిన పరేడ్‌ను పరిశీలించి గౌరవ వందనాన్ని స్వీకరించారు. పోలీస్ శాఖలో క్రమశిక్షణ చాలా అవసరమని, ప్రతిఒక్కరూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలన్నారు. అనంతరం పోలీసు సిబ్బంది సమస్యలపై గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు.

నెలాఖరుకు ఆర్ అండ్ ఆర్ కాలనీ సిద్ధం

- మంచినీరు అందించాకే రండి
- నవంబరులో లాటరీ పద్ధతిలో ప్లాట్ల పంపిణీ
- మూలపేట నిర్వాసితులతో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్


అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

నౌపడ : నౌపడలో ఏర్పాటు చేస్తున్న మూలపేట పోర్టు ఆర్ అండ్ ఆర్ కాలనీని ఈనెలాఖరుకు సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ వెల్లడించారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో చేపడుతున్న ఎర్త్ ఫిల్లింగ్ పనులను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. అనంతరం పలువురు నిర్వాసితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వాసితులు పలు అభ్యంతరాలను లేవనెత్తారు. ఆర్ అండ్ ఆర్ కాలనీ 55 ఎకరాల్లో ఉప్పునీరు పడుతోందని, ఎక్కడ బోరు వేసినా ఉప్పునీరే పడుతోందని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆర్ అండ్ ఆర్ కాలనీ ప్రతి నాలుగైదు ఏళ్లకు వరదలతో ముంపునకు గురవుతోందని, వరదనీరు తరలించేందుకు శాశ్వత కెనాల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పిడిఎఫ్‌ను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై కలెక్టర్ స్పందిస్తూ ఉప్పునీరు పడుతుందని నిర్వాసితులు ఆందోళన చెందవద్దని, పూర్తిస్థాయిలో మంచినీరు అందించాకే కాలనీకి రావాలన్నారు. కాలనీకి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న తెలినీలాపురంలో బోర్లు వేశామని, అక్కడ్నుంచి పైపుల ద్వారా తాగునీరు అందిస్తామని తెలిపారు. కాలనీలో వాటర్ ట్యాంకు ఏర్పాటు చేసి ప్రతి వ్యక్తికి రోజుకు వంద లీటర్ల చొప్పున మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పశువులకు, ఇంటి నిర్మాణాలకు, ఇంటి అవసరాలకు నీటిని సరఫరా చేస్తామని చెప్పారు. ఈ నెలాఖరుకు స్థలాన్ని మట్టితో నింపి చదును చేయాలని అధికారులను ఆదేశించారు. నవంబరులో ప్లాట్లకు నంబర్లు కేటాయించి, లాటరీ పద్ధతి ద్వారా పంపిణీ చేస్తామన్నారు. కాలనీకి డ్రైనేజీ వ్యవస్థ పక్కా ప్రణాళికలతో నిర్మించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ప్రసాద్‌ను ఆదేశించారు. వరద నీరు వల్ల కాలనీతో పాటు చుట్టుపక్కల పంట పొలాలు ముంపు బారిన పడకుండా సముద్రంలోకి విడిచిపెట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. పెండింగ్‌లో ఉన్న 17 పిడిఎఫ్‌లకు రెండు రోజుల్లో నిధులు విడుదల చేస్తామన్నారు. మరో 13 పిడిఎఫ్‌లను గుర్తించాలని నిర్వాసితులకు కోరగా పరిశీలించాలని తహశీల్దార్ చలమయ్యను ఆదేశించారు. రెండు, మూడు నెలలు వయసు తేడాతో పిడిఎఫ్‌ను కోల్పోతున్న వారిని కనీసం పోర్టు ద్వారానైనా ఎంతో కొంత పరిహారం ఇప్పించాలని నిర్వాసితులు కోరారు. పరిహార పంపిణీలో వయసు మినహాయింపు ఇవ్వడం కుదరదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి మూలపేట సర్పంచ్ బాబూరావు, గ్రామస్తులు హాజరు కాలేదు. నిర్వాసితులు రాంబాబు, అప్పల్ రెడ్డి, బాలయ్య, శివ మాత్రమే వచ్చి సమస్యలు తెలియజేశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి, రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పెన్షన్ పెంచితేనే ఎన్నికల్లో మద్దతు


స్టిక్కర్లను విడుదల చేస్తున్న పెన్షనర్లు

శ్రీకాకుళం అర్బన్ : పింఛను పెంచకపోతే వచ్చే ఎన్నికల్లో తమ మద్దతు ఉండదని ఇపిఎస్ పెన్షనర్లు స్పష్టం చేశారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఇపిఎస్ పెన్షనర్ల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డి.పార్వతీశం, ఎం.ఆదినారాయణమూర్తి మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో బిజెపి విడుదల చేసిన ఎన్నికల మేనిఫేస్టోలో ఇపిఎస్ ఉద్యోగులకు కనీసం రూ.మూడు వేల పెన్షన్, కరువు భత్యం పెన్షనర్లకు చెల్లిస్తామని హామీనిచ్చిందని గుర్తుచేశారు. తొమ్మిదేళ్లు గడిచినా ఇప్పటికీ హామీ నెరవేర్చలేదన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 75 లక్షల ఇపిఎస్ పెన్షనర్లు ఉన్నారని, వారిలో సుమారు 35 లక్షల మందికి రూ.వెయ్యి లోపు పెన్షన్ మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ఏఒక్కరికీ కరువుభత్యం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సరాసరి పెన్షన్ రూ.1592మాత్రమే వస్తోందన్నారు. ధరలు పెరుగుతున్నా జీవిత కాలం అదే పెన్షన్ ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఇపిఎస్ పెన్షనర్లకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా కేంద్రం అమలు చేయడం లేదన్నారు. కనీస పెన్షన్ రూ.తొమ్మిది వేలు, కరువు భత్యం చెల్లించాలని, పెన్షనర్ల కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య సహాయం అందించాలని, అందరికీ హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాములు, నీలకంఠేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జీడి రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - పలాస

జీడికి గిట్టుబాటు ధర, జీడి పంట సమగ్రాభివృద్ధికి బోర్డు ఏర్పాటు చేయాలని ఈనెల పదో తేదీన కాశీబుగ్గలోని టికెఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు పిలుపునిచ్చారు. కాశీబుగ్గలోని సిపిఎం కార్యాలయంలో రాష్ట్ర సదస్సు పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదస్సుకు ముఖ్య వక్తలుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాసు, రైతుసంఘం రాష్ట్ర నాయకులు ఎం.సూర్యనారాయణ హాజరవుతారని తెలిపారు. జీడి రైతులకు గిట్టుబాటు ధర లేక జీడి రైతులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు గిట్టుబాటు ధర ప్రకటించి ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, జీడి పంట విస్తరణ, నిర్వహణకు గతంలో ఇచ్చిన రాయితీలను పునరుద్ధరించాలని కోరారు. స్థానికంగా పండిన జీడిపిక్కలు కొనుగోలు చేసిన తర్వాతనే విదేశీ జీడిపిక్కల దిగుమతికి అనుమతించాలన్నారు. ఉపాధి హామీ ద్వారా జీడితోట అభివృద్ధికి ఎకరాకు రూ.94 వేలు అందించాలని కోరారు. జీడి పంటకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు ఎన్.గణపతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు ఎస్.లక్ష్మీనారాయణ, ఎన్ మోహనరావు, వి.కృష్ణారావు, డి.కిషోర్ పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు మంజూరు చేయాలి

మోకాళ్లపై కూర్చొని బెంతూ ఒరియాల నిరసన


మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న బెంతు ఒరియాలు

ప్రజాశక్తి-ఇచ్ఛాపురం

ఇంటిగ్రేటెడ్ సర్టిఫికేట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద మోకాళ్లపై కూర్చొని బెంతు ఒరియాలు శుక్రవారం నిరసన తెలిపారు. రెవెన్యూ అధికారుల మొండివైఖరి నశించాలని, నష్టపోతున్న బెంతు ఒరియా విద్యార్థులను ఆదుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బెంతు ఒరియా ప్రతినిధులు ప్రేమ్‌కుమార్, జీవన్ మాట్లాడుతూ బెంతు ఒరియాలకు ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు మంజూరైనట్లు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్ చెప్పడాన్ని ఖండించారు. గత నెల 15న బెంతు ఒరియా విద్యార్థులకు ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ సాయిరాజ్ చేతుల మీదుగా అందించారని, మూడు రోజుల తర్వాత ఆ సర్టిఫికేట్లను తిరస్కరించారని తెలిపారు. ఇచ్చిన ఇంటిగ్రేటెడ్ సర్టిఫికేట్లు తిరిగి ఇవ్వాలని రెవెన్యూ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో విద్యార్థులు పాలిసెట్, ఎంసెట్, లాసెట్, ఈసెట్ కౌన్సెలింగ్‌లకు అనర్హులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము పడుతున్న ఇబ్బందులకు పరిష్కార మార్గం చూపకపోతే వచ్చే ఎన్నికలను బహిష్కరిస్తామని స్పష్టం చేశారు.

టిడిపిలో అలాంటి నాయకుల్లేరు : ధర్మాన

శ్రీకాకుళం రూరల్ : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు కీ.శే ఎన్.టి రామారావుతోనే ఆ పార్టీ సిద్ధాంతాలు కాలగర్భంలో కలిసిపోయాయని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ప్రస్తుతం ఉన్న ఆ పార్టీ నాయకులకు సిద్ధాంతాలతో పనిలేదని, దోచుకోవడం, దాచుకోవడం నైజంగా మార్చుకున్నారని విమర్శించారు. మండలంలోని గనగళ్లవానిపేట గ్రామ సచివాలయ భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చట్టం ముందు అంతా సమానులేనని, దర్యాప్తు బృందాలు తీసుకున్న ప్రతి చర్యా నిరూపణ కావడం వల్లే చంద్రబాబు జైలుకెళ్లారని తెలిపారు. రాజకీయాల్లో పదవులు ముఖ్యం కాదని, ప్రజలకు చేసిన సేవలే చిరస్మరణీయంగా నిలుస్తాయని చెప్పారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రజలందరూ ఆనందంగా ఉన్నారని చెప్పారు. భవిష్యత్ తరం కోసమే ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

ఇరుకు ప్రదేశంలో ఆరోగ్య సురక్ష

ఎంపిడిఒపై కలెక్టర్ ఆగ్రహం


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

నౌపడ : సంతబొమ్మాళి మండలం ఇజ్జువరం పంచాయతీలో ఇరుకు ప్రదేశంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించడంపై కలెక్టర్ మండిపడ్డారు. కార్యక్రమం నిర్వహించే పద్ధతి ఇదేనా అని ఎంపిడిఒ ప్రేమలీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. వైద్య పరీక్షలు, అందుబాటులో ఉన్న మందుల పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇరుకు ప్రదేశంలో ఏర్పాటు చేయడంతో పరీక్షలు చేసేందుకు, మందులు ఇచ్చేందుకు వైద్య సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన ప్రజలకూ ఇక్కట్లు పడ్డారు. దీంతో ఎంపిడిఒపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమం నిర్వహించే తీరు ఇదేనా అని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డేపల్లి లావణ్య, వైసిపి నాయకులు గోపాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు ఉమాపతి, నౌపడ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి కేసులపై సమగ్ర విచారణ


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

టెక్కలి : సబ్ కలెక్టరేట్ పరిధిలోని 16 మండలాల్లో గల ఎస్‌సి, ఎస్‌టి కేసులపై త్వరితగతిన విచారణ చేపట్టాలని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్‌స్థాయి తహశీల్దార్లు, ఎంపిడిఒలు, విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మూడు నెలలకోసారి మండల స్థాయిలో విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని, ఆయా సమావేశాల్లో సభ్యులు చేసిన వినతులపై స్పందించాలని సూచించారు. అనంతరం వాటి పరిష్కారం, అంశాలపై దృష్టిసారించాలన్నారు. ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శం


కరాటే విద్యార్థులను అభినందిస్తున్న పోలీస్ సిబ్బంది

పోటీతత్వం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

విద్యార్థి దశనుంచే పోటీతత్వం అలవర్చుకోవాలని జెఆర్ పురం ఎస్ఐ జి.రాజేష్ అన్నారు. ఇటీవల కేరళ రాజధాని తిరువంతపురంలోని ఇండోర్ స్టేడియంలో వరుసగా రెండు రోజులు జరిగిన సెన్సాయ్ సిటెట్ సౌత్ జోన్ కాంపిటీషన్‌కు స్థానిక శ్రీ పరశురామ యుద్ధ కళాక్షేత్రానికి సంబంధించిన 10 మంది విద్యార్థులు శిక్షకుడు లింగాల ఈశ్వరావు ఆధ్వర్యంలో పోటీలో పాల్గొన్నారు. ఈ కాంపిటీషన్లో పదిమంది విద్యార్థులు అద్భుతమైన విజయాన్ని సాధించి బంగారు పతకాలు పొందారు. గోల్డ్ మెడల్ ఎం.పవన్ సాయి, ఆర్.జ్ఞానచంద్ నాయుడు, కె.హారీష్, డి.సుమన్, బి.ప్రవీణ, సిహెచ్ పవన్, సిల్వర్ మెడల్ డి.సుచిరిత, బిందు మాధురి, ఎల్.అలీష్ చైతన్య, ఎస్.రేవంత్ సాధించారు. వీరిని శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో ఎస్ఐ రాజేష్, ఎఎస్ఐ రమణ మూర్తి, పోలీస్ సిబ్బంది అభినందించారు.

కరాటే పోటీలకు సిక్కోలు క్రీడాకారులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో ఈనెల ఎనిమిదో తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ కరాటే పోటీలకు జిల్లాకు చెందిన 20 మంది క్రీడాకారులు శుక్రవారం బయలుదేరి వెళ్లారు. సాయిబాబా మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన వీరంతా శిక్షణ పొందుతున్నారు. వీరంతా అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు.

ఈ సందర్భంగా క్రీడాకారుల ప్రోత్సాహ కార్యక్రమాన్ని అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ అధ్యక్షతన నగరంలోని ఆఫీసర్స్ కాలనీ ఎపిజె అబ్దుల్ కలాం పార్కులో నిర్వహించారు. సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లేపల్లి రాంగోపాల్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్, వ్యాపారవేత్తలు రావుల గాంధీ, రావుల కృష్ణ, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ నటుకుల మోహన్ తదితరులు హాజరై క్రీడాకారులను ప్రోత్సహిస్తూ తమవంతు సహకారాన్ని అందించారు.


పొందూరు: ధర్మపురంలో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న స్పీకర్

ప్రజాశక్తి - పొందూరు

రాష్ట్రంలో చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికి ఆదర్శవంతమైనదని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలం ధర్మపురం గ్రామంలో శుక్రవారం కింతలి పిహెచ్‌సి ఆధ్వర్యంలో సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ద్వారా రాష్ట్రంలోని సుమారు 1.63కోట్ల కుటుంబాలకు చెందిన సుమారు ఐదు కోట్ల మంది ఆరోగ్య డేటాను ఈ కార్యక్రమం ద్వారా సేకరించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, వైసిపి మండల అధ్యక్షుడు రమేష్‌కుమార్, మండల జెసిఎస్ బాడాన వెంకట కృష్ణారావు, సర్పంచ్ పాపారావు, పిఎసిఎస్ అధ్యక్షుడు రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: నగర పరిధిలో ఉన్న పెద్దపాడు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు సందర్శించారు. సంబంధిత వైద్య సిబ్బందితో మాట్లాడారు. వైద్య సేవలు అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణ మూర్తి, గార జెసిఎస్ కన్వీనర్ సిద్దిపడి రాధా మాధవి, చిట్టి రవి కుమార్, దళరధ, గుర్రు రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పిలుపు నిచ్చారు. పైడిభీమవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, రణస్థలం మండలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జడ్‌పిటిసి టొంపల సీతారాం, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, ఎంపిడిఒ రమణమూర్తి, ఎఒ ధనుంజయరావు, పంచాయతీ అధికారి ప్రభాకరరావు, వైద్యులు గిరిబాబు, రజని, సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

పోలాకి: దెల్లాయివలస సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణ చైతన్య పాల్గొన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగి నాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, వైస్ ఎంపిపి కోట అప్పారావు, సర్పంచ్ చింతు జగ్గునాయుడు, చింతు రామకృష్ణ, వైద్యులు శ్రీనాథ్, రత్నం రాజు, చందనం, ఎంపిడిఒ ఉష్మశ్రీ, ఇఒ ఎస్.రవికుమార్, ఆరోగ్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఉచిత వైద్య సదుపాయాలు అందుబాటులో తేవడం జరిగిందని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ అన్నారు. శుక్రవారం మండలంలో కొళిగాం గ్రామ సచివాలయం పరిధిలో కొళిగాం పంచాయితీ గ్రామంలో "జగనన్న-ఆరోగ్య సురక్ష శిబిరం" నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జెడ్‌పి చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రజలకు ఉచిత వైద్యపరీక్షలు, సీనియర్ వైద్యుల నుండి ఉచిత సంప్రదింపులు, ఉచిత మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ చేతులు మీదుగా "జగనన్న-ఆరోగ్య సురక్ష శిబిరాన్ని" ప్రారంభించారు. అవిపుడే లక్ష్యంగా సాగుతున్న ప్రభుత్వంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఆంధ్రప్రదేశ్ పాలన ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రతి కుటుంబంలోని పెద్దలు, మహిళలు, పిల్లల ఆరోగ్య భద్రతకు జగనన్న ఎప్పటి నుంచో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు నర్తు రామారావు, సిడ్ ఎపి చైర్మన్ సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర రెడ్డి, మండల ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, పిఎసిఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్ర యాదవ్, టౌన్ పార్టీ అధ్యక్షులు బలిపాడ ప్రకాష్ పట్నాయక్, మండల జెసిఎస్ అధ్యక్షులు ఆశి పురుషోత్తం, దువ్వు వివేకానందరెడ్డి తదితరులున్నారు.

పోలాకి: దీర్ఘాశి సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగి నాయుడు, మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, సర్పంచ్ మెండ సుమంగళి, డిటి పి. శ్రీనివాసరావు, వైద్యులు శ్రీనాథ్, రత్నం రాజు, చందనం, ఎంపిడిఒ ఉష్మశ్రీ, ఇఒ ఎస్. రవికుమార్, ఎంఇఒ లింగరాజు, ఆరోగ్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: చినవంకలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో చిన్నిపల్లి వైద్యులు విద్యాధర్, స్త్రీ వైద్య నిపుణులు లక్ష్మి సచివాలయ కన్వీనర్ వడ్డీ కరుణాకర్, కృష్ణారావు, శ్రీకాంత్, ఎంపిటిసి ఢిల్లేశ్వరరావు, ఎంపిడిఒఓ ఈశ్వరమ్మ, డిటి గిరిరాజ్ పాల్గొన్నారు.

నందిగాం: మండలం దిమ్మిడిజోల గ్రామంలో వైస్ ఎంపిపి రేగాన లక్ష్మీకాంత కూర్మారావు అధ్యక్షతలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి ఎన్. శ్రీరామమూర్తితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు కురమాన బాలకృష్ణారావు, తహసీల్దార్ పద్మావతి, వైద్యాధికారులు అంజలి, అనితకుమారి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, సర్పంచులు ,బోయిన ర సోమేశ్వరరావు తమిరి దేవేందర్,కొల్లి శ్రీరాములు వైద్య శాఖ సిబ్బంది, ఆశ వర్కర్లు అంగన్వాడీ కార్యకర్తలు, పంచాయతీ సెక్రెటరీ, వలంటీర్లు, పలువురు వైఎస్ఆర్సీపీ నాయకులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : జగనన్న ఆరోగ్య సురక్ష పేదల వరం మని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, మాజీ కేంద్ర మంత్రి డా కిల్లి కృపారాణి, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు.శుక్రవారం టెక్కలి పంచాయతీ కార్యాలయం జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎక్స్ ఎంపిపి రాఘవరావు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు చింతాడ మంజు. సర్పంచ్ గొండెలి సుజాత, హైందవి మోహన్, పిఎసిఎస్ అధ్యక్షులు సత్తారు సత్యం, టెక్కలి ఎంపిపి సరోజనమ్మ, ఎంపిడిఒ లక్ష్మి బాయి, ఎంపిటిసి శ్రీధర్ రెడ్డి, కూన పార్వతి, పీత హేమలత, గ్రామస్తులు పాల్గొన్నారు.

సోంపేట: బారువ సచివాలయ పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పిటిసి తడక యశోద, ఎంపిపి డాక్టర్ దాసు, వైస్ ఎంపిపి శ్రీనివాసరావు, సర్పంచ్ ఎగ్ర రజని, పి.రాజేశ్వరరావు, తడక జోగారావు తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: తోటవాడ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కె.దీప, జెడ్‌పిటిసి రామారావు, రాష్ట్ర టిట్కో డైరెక్టర్ గోవిందరావు, సర్పంచ్ ఆనందరావు, వైస్ ఎంపిపిలు సూర్యరావు, కృష్ణం నాయుడు, ఎంపిడిఒ రవీంద్రబాబు, తహశీల్దార్ రమణారావు, వైద్యులు రాజశేఖర్, రోజా, రిమ్స్, కిమ్స్, జేమ్స్ వైద్యులు పాల్గొన్నారు


వైద్యశిబిరంలో రోగులతో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన

పలాస : మండలంలోని లొద్దభద్ర గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్ నాయుడు, మండల విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, వైసిపి నాయకులు చింతాడ మాధవరావు, రాకేష్ రెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి, గైనకాలజిస్ట్ యు స్వారాజ్యలక్ష్మి, వైద్యులు గౌరీ ప్రసాద్, అంజలి, బోనేల గోపాల్, కామేశ్వరరావు, పద్మ, శ్యామలాదేవి, సత్యవతి పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని గురండి గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్పంచ్ బోర.సింహ ద్రి నాయుడు.అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్‌ఎ రెడ్డి శాంతి పాల్గొన్నారు. కార్యక్రమంలో వైద్యులు రామకష్ణ, రాంబాబు, తాసింగ్, జనకి రామయ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


కోటబొమ్మాళి: మండలంలోగల పెద్దబమ్మిడి పంచాయతీ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరం నిర్వహించారు. టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు బాడాన మురళి, కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు, హేమసుందరరాజు, పేడాడ వెంకటరావు, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, డిటి ఆర్. మధు, సర్పంచ్ మెండ అప్పలనరసమ్మ, ఎంపిటిసి మెండ జనార్ధనరావు, మండల వైద్యులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


రచ్చబండలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

తీర ప్రాంతంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పల్లెనిద్ర

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలో తీర ప్రాంత డొంకూరులో విస్తృతంగా పర్యటించారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా రాత్రి గ్రామస్తులతో కలిసి గ్రామంలో ఉన్న సమస్యలు తెలుసుకొని పరిష్కరించుకునే విధంగా చర్యలు తీసుకున్నారు. గ్రామంలో స్థానిక మహిళలతో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డొంకురు పంచాయతీలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలకు అర్హులై వుండి పథకాలు అందని వారు ఎవరైనా వుంటే తెలియజేయాలని కోరారు. అనంతరం డొంకురు గ్రామంలోని పలు విధుల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, బైపల్లి రామారావు, సర్పంచ్ ప్రతినిది బుడ్డ రుషి, కారంగి మొహనరావు, ఉప్పడ రాజారెడ్డి, రంపత్ని చిట్టిబాబు, ఉమా శంకరరావు పాల్గొన్నారు.


మంత్రిని సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

విద్యతోనే ఉన్నత స్థానం


ప్రజాశక్తి- పలాస

చదువు ఎంత ఇష్టంగా చదివితే అంత ఉన్నత స్థానానికి చేరుకుంటారని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య శాఖ, పాడిపరిశ్రమాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నతమైన చదువుల వైపు ప్రయాణించాలని, చదువుతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్య కోసం పెద్ద ఎత్తున నిధులు వెచ్చిస్తున్నారని, నాడు-నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు రూపురేఖలే మారిపోయిందన్నారు. కార్పోరేట్ విద్యా సంస్థలతో ప్రభుత్వ కళాశాలలు పోటి పడుతున్నాయని, నేడు ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు కోసం క్యూకట్టే పరిస్థితి వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, సీనియర్ నాయకులు హనుమంతు వెంకటరావు మాష్టారు, తూముల శ్రీనివాస్, ఎఎంసి చైర్మన్ సతీష్ కుమార్, డివిఒ, కళాశాల ప్రిన్సిపల్ మోహన్, రాంమోహన్ దొర (బుజ్జి మాష్టారు), శ్రీను, చిరంజీవి విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా 'ఉపాధి'

ప్రజాశక్తి- లావేరు

ప్రణాళిక బద్ధంగానే ఉపాధి పనులు మంజూరు చెయ్యడం జరగాలని వైసిపి నాయకులు లుకలాపు అప్పల నాయుడు అన్నారు. మండలంలోని పెదలింగాలవలసలో శుక్రవారం సర్పంచ్ లుకలాపు యశోద అధ్యక్షతన ఉపాధి హామీ పథకం ద్వారా పనులు గుర్తింపుపై గ్రామ సభ నిర్వహించారు ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ 2024-2025 ఆర్థిక సంవత్సరానికి పనులు ప్రణాళికలతో ప్రాధాన్యత కలిగిన పనులు గుర్తింపు, పనులు ప్రారంభించడం జరగాలన్నారు. సమావేశంలో కార్యదర్శి మడ్డి రమణ, ఉపాధి ఫిల్డ్ అసిస్టెంట్ బోబ్బాది సత్యం, మాజీ సర్పంచ్లు గొర్లె రామినాయుడు, వెలుగు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



న్యూస్ క్లిక్‌పై దాడి హేయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్


నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

స్వతంత్ర ఆన్‌లైన్ పోర్టల్ న్యూస్ క్లిక్‌పై మోడీ సర్కారు ఉక్కుపాదం మోపడాన్ని ఖండిస్తూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) ఆధ్వర్యాన జర్నలిస్టులు నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ న్యూస్ క్లిక్ పై బిజెపి ప్రభుత్వం అసత్య ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. ఉపా చట్టం కింద నేరపూరిత కుట్రలకు పాల్పడుతూ పలు కేసులు పెట్టడం గర్హనీయమన్నారు. ప్రభుత్వానికి ఇష్టం లేని వార్తలు ప్రసారం చేస్తున్నందునే ప్రముఖ పాత్రికేయుడు, రచయిత ప్రబీర్ పుర్కాయస్థ నేతత్వంలో నడుస్తున్న ఆ పోర్టల్ పై ఆరోపణలు చేస్తూ అక్రమ కేసులతో వేధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. మోడీ ప్రభుత్వ నిరంకుశ విధానాలు, మీడియాపై దాడులు, వేధింపుల వల్ల ఇప్పటికే దేశం ప్రపంచ పత్రికా స్వాతంత్ర్యంలో అట్టడుగు స్థాయికి చేరిందని గుర్తు చేశారు. ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గరుకు లక్ష్మణరావు మాట్లాడుతూ న్యూస్ క్లిప్ పై దాడిని దేశంలో మీడియా స్వేచ్ఛపైనా, ప్రజల భావ ప్రకటన స్వేచ్ఛపైనా దాడిగా పేర్కొన్నారు. మీడియాపై దాడులను సహించేది లేదని హెచ్చరించారు. సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాసు మాట్లాడుతూ తమకు అనుకూలంగా లేని పత్రికలు, వ్యవస్థలపై కేంద్రం పదేపదే దాడులు చేయిస్తుందని విమర్శించారు. న్యూస్ క్లిక్‌పై జరిగిన దాడిని ఖండించడంతో పాటు ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాల్లో కలసిరావాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రం పోకడలను చూస్తూ ఊరుకుంటే వ్యవస్థల మనుగడ ప్రశ్నార్థకమవుతుందన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు టి.భీమారావు పి.గణేష్, ఎ.సోమశేఖర్, ఎస్.వి రమణ, కిల్లి శ్రీను, కె.శంకర్, ఎపిఎంఎఫ్ జిల్లా అధ్యక్షులు చింతపల్లి నాగభూషణరావు, విజెఎఫ్ జిల్లా అధ్యక్షులు టెంక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'ఐతమ్'లో నూతన పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్



ప్రసన్నను అభినందిస్తున్న ఐతమ్ కళాశాల సిబ్బంది

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల సిఎస్ఇ విభాగం అధిపతి డాక్టర్ యు.డి.ప్రసన్న నూతనంగా రచించిన 'డేటా డిటెక్టివ్ యూజింగ్ మిషన్ లెర్నింగ్' అనే పుస్తకాని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు శుక్రవారం తన ఛాంబర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ రంగంలో వస్తున్న నూతన మార్పులపై అవగాహన పెంచుకొనేందుకు ఈ పుస్తకం ఉపకరిస్తుందన్నారు. కంప్యూటర్ విభాగంలో చదువుతున్న, అధ్యయనం చేస్తున్న విద్యార్థులకు, అధ్యాపకులకు మార్గదర్శిగా ఉపయోగపడుందని ఆయన అభిప్రాయ పడ్డారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ డి.ఆజాద్, సిఎస్ఇ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.జయంతిరావు, బోధన, బోధనేతర సిబ్బంది రచయిత డాక్టర్ యు.డి.ప్రసన్నను అభినందించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - రణస్థలం రూరల్

మండలంలోని కొండములగాం పంచాయతీ ముక్తుంపురం గ్రామానికి చెందిన జామి రాము (55) అనుమానాస్పదస్థితిలో మృతి చెందారు. మృతుడు గురువారం రాత్రి భోజనం చేసిన తరువాత ఏం జరిగిందో గానీ వేకువజామున ఆయన ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపి అంత్యక్రియలు చేసే ప్రయత్నం చేశారు. విషయం పోలీసులకు తెలియడంతో జెఆర్‌పురం ఎస్ఐ జి.రాజేష్ తన సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి అంత్యక్రియలు ఆపించారు. అనంతరం జామి రాము మృతి అనుమానాస్పద స్థితిగా భావించి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఆయనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులకు చెప్పే ప్రయత్నం చేశారు.


రాము మృతదేహం

చివరకు కొండములగాం విఆర్ఒ ఫిర్యాదు మేరకు జెఆర్ పురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈయన మృతిపై కుటుంబ సభ్యులపై అనుమానం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై జెఆర్.పురం సీఐ ఎన్.ఆదాం కుటుంబ సభ్యులను విచారణ చేపట్టారు. అనుమానాస్పద స్థితి మృతిగా కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం డిఎస్‌పి వై. శృతి విషయం తెలిసిన వెంటనే జెఆర్.పురం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి రాము మృతికి గల కారణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ ఆదాం మాట్లాడుతూ మృతికి గల కారణాలను పరిశీలించి విచారణ చేపట్టి నిందితులను పట్టుకుంటామని తెలిపారు. మృతుడు రాముకు భార్య లక్ష్మి, కుమారుడు మణికంఠ, కోడలు సోమేశ్వరి ఉన్నారు. రాము మృతి జరిగిన సమయంలో వారంతా ఒకే ఇంట్లో నివాసం ఉంటున్నారు.

పంట నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఖరీఫ్ 2023వ సంవత్సరం పంట నమోదుకు ఈనెల 9 ఆఖరి తేదీ అని రైతులు ఎవరైనా పంట నమోదు చేసుకోకపోతే రైతు భరోసా కేంద్రం వద్ద పంట నమోదు చేసుకోవాలని పలాస ఎడిఎ ఎల్.వి.మధుబాబు అన్నారు. శుక్రవారం పెద్ద పద్మాపురం సచివాలయంలో మాట్లాడుతూ పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు గ్రామ వ్యవసాయ సహాయకులు వద్ద పంట ధ్రువీకరణ చేసుకోవాలన్నారు. శ్రీకాకుళం జిల్లా రైతులు ఇకెవైసికి ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అధికారులు స్లాట్ ఇస్తున్నారని రైతులు ఈ విషయాన్ని గమనించి రైతు భరోసా కేంద్రాల వద్ద నమోదు చేయించుకోవాలన్నారు. ఇకెవైసి చేసుకున్న రైతులకు ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యాన్ని అమ్ముకోవడం, డాక్టర్ వైఎస్ఆర్ ఉచిత పంటల భీమా, ప్రకృతి వైపరీత్యాలు వల్ల కలిగే పంట నష్టాలకి పంట నష్టపరిహారము, సున్నా వడ్డీ పంట రుణాలు వంటి పథకాలు వర్తిస్తాయన్నారు. మామిడి గుడ్డి గ్రామంలో పంట నమోదు చేసుకున్న రైతుల ఇకెవైసిని పరిశీలించారు. కార్యక్రమంలో ఎఒ దానకర్ణుడు, వ్యవసాయ సహాయకులు పుష్ప, త్రివేణి, రైతులు పాల్గొన్నారు.


ఇకెవైసిని పరిశీలిస్తున్న ఎడిఎ మధుబాబు

బండారు క్షమాపణలు చెప్పాలి

ప్రజాశక్తి - టెక్కలి రూరల్


మాట్లాడుతున్న చింతాడ మంజు

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజాకు టిడిపి నేత బండారు సత్య నారాయణ క్షమాపణలు చెప్పాలని వైసిపి జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు చింతాడ మంజు డిమాండ్ చేశారు. బండారు వ్యాఖ్యలు ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. స్త్రీలను గౌరవించేవారెవరూ ఇలా అసభ్యకరంగా మాట్లాడరన్నారు. రోజాకు బహిరంగ క్షమాపణలు చెప్పాలన్నారు. ఈమెతో సర్పంచ్ గొండెలి సుజాత, ఎంపిటిసి పీత హేమలత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో జానపద గాయకుడు మృతి

ప్రజాశక్తి- పలాస


ఘటనా స్థలం వద్ద అశోక్ మృతదేహం

మండలంలోని మాకన్నపల్లి, బొడ్డపాడు జాతీయ రహదారి మధ్యలో మాకన్నపల్లి గ్రామానికి చెందిన ఉద్దాన జానపద గాయకుడు, రచయిత సాలిన అశోక్ (38) శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడిక్కడే మృతి చెందిందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పలాస మండలం మాకన్నపల్లికి చెందిన సాలిన అశోక్ తమ సొంత పనులు నిమిత్తం ద్విచక్ర వాహనంపై కాశీబుగ్గ వెళ్తుండగా జాతీయ రహదారి నుంచి బొడ్డపాడు వైపు లగేజ్ వ్యాన్ అతి వేగంతో వచ్చి ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో సాలిన అశోక్ అక్కడిక్కడే మృతి చెందారు. మృతుడు జాతీయ రహదారి అథారిటీలో కాంట్రాక్టు డ్రైవర్‌గా పనిచేస్తూ, ఖాళీ సమయంలో జానపద నృత్యాలు చేయడం, పాటలను సొంతంగా రచించి పాడుతుంటారు. అండమాన్, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం తదితర ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. రోడ్డు ప్రమాదంలో అశోక్ మృతి చెందడంతో భార్య, తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతునికి భార్య అనిత, కుమారులు నిషాంత్(9), రుద్రేష్(6) ఉన్నారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేశారు.

'వైసిపి నాయకుల మాటల్లో మార్పు'

పలాస : వైసిపి నాయకులు గత కొద్ది రోజులుగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అవినీతి చేసాడని ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, ఇప్పుడు ప్రభుత్వానికి చెందిన న్యాయవాది రూ.27 కోట్లు అవినీతి చేశారని, ఆ డబ్బులు టిడిపి పార్టీకి విరాళాలుగా వచ్చాయని కోర్టుకు చెప్పడం విడ్డూరంగా ఉందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, మాజీ మంత్రి గౌతు శివాజీ అన్నారు. కాశీబుగ్గలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారానికి 24 రోజుకు చేరుకుంది.

గుండెపోటుతో రేషన్ డీలర్ల అధ్యక్షుడు మృతి

ప్రజాశక్తి- పలాస


సోమేశ్వరరావు

కాశీబుగ్గ తిలక్ నగర్‌లో నివాసం ఉంటున్న జిల్లా రేషన్ డిపో డీలర్ల సంఘం అధ్యక్షుడు డొక్కా సోమేశ్వరరావు (58) గుండె పోటుతో తన నివాసంలో శుక్రవారం మృతి చెందారు. స్థానికులు కథనం ప్రకారం డొక్కా సోమేశ్వరరావు సొంత గ్రామం పలాస మండలంలొద్దభద్ర చాలా ఏళ్ల క్రితం కాశీబుగ్గలో నివాసం ఉంటున్నారు. తన భార్య జయలక్ష్మి షిరిడీ వెళ్ళారు. శుక్రవారం ఉదయం తన భర్తకు ఫోన్ చేస్తున్నా లిఫ్ట్ చేయకపోవడంతో ఇంటి పక్కన నివాసం ఉంటున్న మహిళకు ఫోన్ చేసి తన భర్తకు ఫోన్ ఇవ్వాలని చెప్పింది. ఆమె వెళ్లి చూసేసరికి విగతజీవిగా పడి ఉండడం చూసి జయలక్ష్మితో పాటు చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చింది. మృతుడు లొద్దభద్ర గ్రామంలో గత 32 ఏళ్లుగా రేషన్ డిపో డీలర్‌గా పని చేస్తున్నారు. పలాస రేషన్ డిపో డీలర్ల సంఘం వైస్ ప్రెసిడెంట్‌గా, టెక్కలి డివిజన్ సంఘం అధ్యక్షుడుగా, గత ఏడాదిన్నర నుంచి జిల్లా రేషన్ డిపో డీలర్ల సంఘం అధ్యక్షుడుగా పని చేస్తున్నారు. మృతదేహాన్ని బంధువులు స్వగ్రామం లొద్దభద్ర గ్రామానికి తరలించారు.

ట్రెజరీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్


వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌జిఒ నాయకులు

ముందస్తు సమాచారం లేకుండా ఆడిట్ పేరుతో ఉద్యోగులను వేదింపులకు గురిచేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం కోరారు. ట్రెజరీ ఉద్యోగులతో కలిసి కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యాలయ ఉత్తర్వులను మార్చి తీవ్ర ఒత్తిడికి గురిచేయడం తగదన్నారు. కార్యాలయ నెట్‌వర్క్ ఛార్జీలు సైతం ఉద్యోగులే చందాలు వేసుకుని చెల్లిస్తున్నారని, అభద్రతా వాతావరణంలో ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. ఈసమస్యలను డిడితో మాట్లాడాలని ఉద్యోగులు ప్రయత్నించినా ఆయన అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారని, ఈసమస్యలను పరిష్కరించేందుకు జోక్యం చేసుకోవాలని కలెక్టరును కోరారు. కలెక్టరును కలసిన వారిలో ట్రెజరీ ఉద్యోగులు ఎం భాగ్యలక్ష్మి, పి.శ్రీనివాసరావు, ఎం.డేవిడ్, చంద్రశేఖర్ ఎల్.మధుసూధనరావు తదితరులు ఉన్నారు


ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు 'ఉన్నతి' రుణాలు

ఆమదాలవలస : మండలంలో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల కుటుంబాలకు చెంది పంచ సూత్రాలు పాటిస్తున్న స్వయంశక్తి సంఘాల మహిళల జీవనోపాధులను మెరుగుపర్చుటకు ప్రభుత్వం ఉన్నతి పథకం ద్వారా రుణాలను మంజూరు చేస్తున్నట్లు వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు వివరించారు. శుక్రవారం వెదుళ్లవలస గ్రామ సంఘం పరిధిలో సర్పంచ్ చిలకలపల్లి సురేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి నెల సమావేశం జరుపుకొని, సమావేశంలోనే పొదుపులు, అప్పులు వసూలు చేసుకోని, పుస్తకాల నిర్వహణ చక్కగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు ప్రతి నెల గడువు దాటకుండా, బకాయి లేకుండా, చెల్లిస్తున్న వారందరికీ వడ్డీ లేకుండా మంజూరు చేసే అవకాశం ఉన్నట్లు తెలిపారు. గతంలో రుణాలు తీసుకొని యూనిట్లు పెట్టని వారికి, సకాలంలో కట్టని సంఘ సభ్యులకు ఈ పథకం వర్తించదని, నిబంధనలన్నింటినీ వివరించారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్ సుభద్ర, విఒఎ. రమ, గ్రామ సంఘం అధ్యక్షురాలు బత్తుల రాజు, పంచాయతీ వార్డు మెంబర్ అగత కూర్మారావుతో పాటు స్వయం శక్తి సంఘాల లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గళాలపై ప్రభుత్వం దాడులు

ప్రజాశక్తి- పలాస

ప్రజా సంఘాలు, మీడియాపై ఇటీవల ఎన్ఐఎ బృందాలు ఇళ్లకి వెళ్ళి దాడులు చేయడం, కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేయడం దారుణమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు అన్నారు. కాశీబుగ్గలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రశ్నించే కళాలు, గళాలపై ఎన్ఐఎ దాడులు చేసి అక్రమంగా అరెస్టు హేయమైన చర్యగా భావిస్తున్నామన్నారు. దేశంలో సంపదని వనరులను కొల్లగొట్టి కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేస్తున్న మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను బట్టబయలు చేస్తున్న మీడియా ముఖ్యంగా న్యూస్ క్లిక్, ది వైర్ లాంటి పత్రికలపైన కక్ష సాధింపు చర్యలు చేపట్టడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సిపిఐ(ఎం.ఎల్) శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, జుత్తు వీరాస్వామి, బైరి కూర్మారావు మామిడి భీమన్న, బి.ఈశ్వరమ్మ, సోమేశ్వరరావు, వినోద్, బంగ్లా కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిట్టిపాటి వెంకటేశ్వర్లు

తూటికాడ కషాయం తయారీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని జి.కె.వలస గ్రామంలో ప్రకతి వ్యవసాయ సిబ్బంది రైతులచే సామూహికంగా తూటికాడ కషాయాన్ని తయారు చేయించారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి మాట్లాడుతూ శుక్రవారం 80 లీటర్ల తూటికాడ కషాయాన్ని తయారు చేయించామని తెలిపారు. వరి పంటలో ఈ కషాయాన్ని పిచికారి చేసుకుంటే పంటను ఆశించే పచ్చదోమ, సుడిదోమ నివారణ చేయవచ్చునన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఎల్‌టు డిజిటల్ సురేష్ మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు ఎంతో ఆసక్తితో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఆచరించడానికి ముందుకు వస్తున్నారని, మా సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతులకు పూర్తిగా అందుబాటులో ఉండి ప్రకృతి వ్యవసాయ విధానాలను పంటల్లో ఆచరింపచేసేలా చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జానకిరాం, రైతులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న సంఘ సభ్యులు

క్షతగాత్రునికి 'మాతృమూర్తి' అండ

కవిటి : మండలం పాత వరక గ్రామానికి చెందిన కిడ్నీ బాధితుడు నేదురు వల్లభరావు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఇప్పటికే డయాలసిస్ చేయించుకుంటున్న అతనికి ఎదురైనా ఈ ఆపదతో మందులు కూడా కొనుక్కొలేని లేని పరిస్థితికి చేరుకున్నాడు. రెక్కాడితే డొక్కాడని అతని పరిస్థితి తెలుసుకున్న స్థానిక మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు శుక్రవారం గ్రామానికి చేరుకుని అతనికి ధైర్యం చెప్పి తక్షణ సహాయంగా రూ.5 వేలు అందించారు. అంతేకాకుండా దయనీయ పరిస్థితిలో ఉన్న వల్లభరావును దాతలు ఉదారంగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భవానీ శంకర్

'జగనన్నకు చెబుదాం'పై సమీక్ష

ప్రజాశక్తి - మెళియాపుట్టి

స్పందనలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారునికి సమగ్ర సమాచారం అందించాలని మండల స్పెషల్ ఆఫీసర్ టి.భవానీ శంకర్ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పి. చంద్రకుమారి, ఇఒపిఆర్‌డి తారకేశ్వరి, మండల పరిషత్ ఎఇ తిరుపతి పట్నాయక్, హౌసింగ్ ఎఇ శ్రీనివాసరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలకు ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి - పొందూరు

మండలం తాడివలస జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన తమ్మినైన రామచంద్రరావు జ్ఞాపకార్థం కుమారులు శ్రీనివాసరావు, ప్రసాదరావులు శుక్రవారం రెండు ఫ్యాన్లను వితరణగా అందజేశారు. ఇటీవల పాఠశాలలో స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా నిర్మించిన కళావేదికలో వీటిని వినియోగించాలని కోరారు. ఈ ఫ్యాన్లను ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు జి.సాయికుమార్‌కు అందజేశారు. ఫ్యాన్లను వితరణగా అందజేయడంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలను తెలియజేశారు.

అవినీతికి తావు లేని పాలన జగన్‌తోనే సాధ్యం

ఆమదాలవలస : గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా గ్రామ సచివాలయాలను స్థాపించి దానికి అనుబంధంగా వాలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి అవినీతికి, వివక్షకు తావు లేకుండా సంక్షేమ పాలనను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శక్రవారం మండలంలోని గాజుల కొల్లివలస పంచాయతీ పరిధిలోని శ్రీహరి పురం, గోవిందపురం, రాధాకృష్ణాపురం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం వంటి రంగాలకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ కార్యక్రమాలను చేపడుతున్నారని



సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని

అన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సచివాలయాల మండల కో-ఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్, సర్పంచ్ ప్రతినిధి మొండేటి కూర్మారావు, నాయకులు పేడాడ శ్యామ్ సుందరరావు, బొడ్డేపల్లి రాజశేఖర్ పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తే అధిష్ఠానానికి ఫిర్యాదు

ప్రజాశక్తి- ఆమదాలవలస

వచ్చే ఎన్నికల్లో తనకే ఎమ్మెల్యే సీటు వస్తుందని పలువురు వైసిపి నాయకులు ప్రచారం చేస్తున్నారని, ఇది సరికాదని మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్ ప్రశ్నించారు. శుక్రవారం పట్టణంలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, స్పీకర్ తమ్మినేని సీతారాంకు వ్యతిరేకంగా కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజల్లో గందరగోళం సష్టిస్తున్నారని ఇప్పటికైనా మానుకోకపోతే వారిపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని అన్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన పార్టీ కార్యవర్గ సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ నియోజకవర్గ ఎమ్మెల్యేలు పార్టీ ఇన్చార్జిలను ఎదిరించి గ్రూపులు నడిపితే సహించేది లేదని హెచ్చరించారని అది అందరికీ వర్తిస్తుందని ఆయన చెప్పారంటే జగన్మోహన్ రెడ్డి చెప్పినట్టేనని ప్రతి ఒక్కరూ భావించాలని అన్నారు. 2024వ సంవత్సర్సరంలో వైసిపి నాయకులు, కార్యకర్తల లక్ష్యం ఒక్కటేనని అది జగన్మోహన్ రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యమని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నియోజకవర్గ ఇన్‌ఛార్జి స్పీకర్ తమ్మినేని సీతారాం నాయకత్వంలో ప్రతి ఒక్కరూ పనిచేయాల్సిందేనన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు దుంపల శ్యామలరావు, చింతాడ వెంకటరమణ, వైసిపి నాయకులు మామిడి రమేష్‌కుమార్, కూన రామకృష్ణ తదితరులున్నారు.

రాయితీపై వలలు, తెప్పలు

ప్రజాశక్తి- సంత బొమ్మాళి

మత్స్య కారులకు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా 75 శాతం సబ్సిడీపై వలలు, తెప్పలు అందజేయడం జరుగుతుందని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ధర్మరాజు పాత్రో అన్నారు. శుక్రవారం డి.మరువాడ షోర్‌షెడ్‌లో మరువాడ మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు సూరాడ జోగారావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి టెక్కలి మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ధర్మరాజు పాత్రో హాజరై మాట్లాడుతూ గతంలో సంప్రదాయ తెప్పలు స్థానంలో ఇంజిన్ బోట్లు మత్స్యకారులకు సబ్సిడీపై అందజేయడం జరుగుతుందన్నారు. రూ.5 లక్షల విలువైన యూనిట్‌కు లబ్దిదారుడు వాటా రూ.1,25000 కడితే మిగతా 3 లక్షల



మాట్లాడుతున్న ఎఫ్‌డిఒ ధర్మరాజు పాత్రో

75 వేలు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సూరాడ రాజారావు, మరువాడ వైసిపి ఇన్‌ఛార్జి గంట ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ మేరుగు నూకయ్య, మత్స్యశాఖ అసిస్టెంట్‌లు పాల వెంకటేష్, నవీన్, వెటర్నరీ అసిస్టెంట్ ఎం.వెంకటరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాకేష్ వర్మ, సాగర మిత్ర నవీన పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

పలాస : ఉన్నత విలువలతో కూడిన విద్యను అందిపుచ్చుకోవాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. కాశీబుగ్గ శ్రీ విద్యా వాహిని డిగ్రీ కళాశాలలో ఫెస్ట్ సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విలువలతో కూడిన విద్య అందిపుచ్చుకొని మెరుగైన సమాజం కోసం విద్యార్థులందరూ కృషి చేసి పట్టుదలతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. అనంతరం విద్యార్థులు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పైల తిరుమలరావు, గిరిబాబు, గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనేల గోపాల్, పైల మన్మధరావు, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూరగాయల సాగులో ఎటిఎం మోడల్

రణస్థలం : రణస్థలం పంచాయతీ రణస్థలం గ్రామంలో పెద్దింటి రాజేశ్వరికి చెందిన 15 సెంట్లు పొలంలో కూరగాయల పంటల్లో ఎటిఎం మోడల్‌ని ప్రకృతి వ్యవసాయ నార్త్ కోస్టల్ రీజినల్ తేమెటిక్ లీడ్ అధికారి ప్రకాష్ శుక్రవారం క్షేత్ర సందర్శన చేసారు. అలాగే సువ్వాడ సంతోష్ కుమారి 15 సెంట్లు విస్తీర్ణంలో ఎటిఎం మోడల్‌ని ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి, రైతులకు శిక్షణ ఇస్తూ ఎటిఎం మోడల్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో నేచురల్ ఫార్మింగ్ మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మోడల్ మేకర్ గంట్యాడ రాంబాబు, పి. సత్యన్నారాయణ, యూనిట్ ఇన్‌ఛార్జులు సంతోష్ కుమార్, కొయ్యన రాంబాబు, లక్ష్మి, జ్యోతి, సంతోషి, సురేష్, ధనలక్ష్మి, సత్యవతి, రైతులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల వితరణ

సంతబొమ్మాళి : సంతబొమ్మాళి గ్రామానికి చెందిన కూచెట్టి అప్పలస్వామి దంపతులు పేదలకు సహాయం అందించాలనే ఆలోచనతో సంతబొమ్మాళి యువజన సేవాసంఘం ప్రతినిధులకు సంప్రదించగా వారి ఆధ్వర్యంలో శుక్రవారం 21 మంది పేదలకు దుప్పట్లను పంపిణీ చేసి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి యువజన సంఘ ప్రతినిధులు కూచెట్టి భానుప్రకాష్, అట్టాడ సాయికుమార్, కొన్న రాము, కట్ట మన్మధ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణతర్లా విద్యార్థుల ప్రతిభ

పలాస : ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభ చాటుకుంటున్నారు. పలాస మండలంలోని బ్రాహ్మణతర్లా జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు వై.మౌనిక, ఎస్. ప్రణీత్ సాయి, బి.హేమంత్ సంయుక్తంగా క్విజ్‌లో ద్వితీయ స్థానం, నాడు-నేడు, నవరత్నాలు అనే అంశంపై వ్యాసరచన పోటీల్లో వై.మౌనిక తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైకుంఠరావు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛన్లు అందక పెన్షనర్ల ఇబ్బందులు

ప్రజాశక్తి - ఆమదాలవలస

రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించుకున్నా పెన్షనర్ల గోడును పట్టించుకోకుండా నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తుండడం సరికాదని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురవరపు సిమ్మి నాయుడు, బొడ్డేపల్లి జనార్ధనరావులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెన్షనర్లకు ప్రతినెల 1వ తారీఖున పెన్షన్‌ను చెల్లించాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా పెన్షనర్లను ఇబ్బందులకు గురి చేస్తుందని అసహనం వ్యక్తం చేశారు. వృద్ధాప్యంలో అనేక ఇబ్బందులతో జీవనం గడుపుతున్న పెన్షనర్లకు సకాలంలో పెన్షన్ రాక మానసికంగా, శారీరకంగా కృంగిపోతున్నామన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెంటనే స్పందించి ప్రతినెలా ఒకటవ తారీఖున పెన్షన్లు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి హెచ్‌వి సత్యనారాయణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రేపు దయాల్బాగ్ వస్తు ప్రదర్శన

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని కళింగ వైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం 'దయాల్బాగ్ వస్తు ప్రదర్శన , అమ్మకాలు నిర్వహిస్తున్నట్లు ఎక్సిబిషన్ కమిటీ కన్వీనర్ ఎం.ఎస్.ఆర్.ఎస్.ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రదర్శనలో దయాల్బాగ్, వారి అనుబంధ సంస్థలు స్వయంగా తయారు చేసిన వస్తువులను విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. కాటన్, టై అండ్ డై చీరలు, దయాల్బాగ్, రూర్కీ, బరేలి, దొమ్మర నంద్యాల దుప్పట్లు, తువ్వాళ్లు, నాప్‌కిన్స్, షర్టింగ్ క్లాత్, దయాల్బాగ్, పూణే, ఖాండ్వా రెగ్జిన్, లెదర్ స్కూల్ బ్యాగులు తదితర ఉత్పత్తులను విక్రయించనున్నట్టు తెలిపారు. నాణ్యమైన, చౌకధరలకు లభ్యం కానున్న వస్తువులను కొనుగోలు చేయాలని కోరారు.

కృష్ణచంద్‌కు వాకర్స్ ఇంటర్నేషనల్ అవార్డు

శ్రీకాకుళం లీగల్ : సీనియర్ న్యాయవాది, సామాజిక సేవకులు వాన కృష్ణచంద్‌కు వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థల చైర్మన్ డాక్టర్ ఎస్.వి.రవీంద్ర వాకర్స్ కేబినెట్ సమావేశంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవిజ్ఞానాన్ని సామాన్యులకు చేరువ చేయటంలో, అణగారిన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందించటంలో కృష్ణచంద్ సేవలను కొనియాడారు. పలు రంగాల్లో సేవలు అందించే పలు స్వచ్ఛంద సేవకులను రవీంద్ర సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ కె.సత్యం, వాకర్స్ ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, ఎస్.జోగినాయుడు, పి.జి గుప్త, కూన వెంకటరమణమూర్తి, కె.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కోటాలో ఎజిబిఎస్‌సిలో సీటు

శ్రీకాకుళం అర్బన్ : ఫెన్సింగ్ క్రీడలో రాణించిన బడి పూజితకు స్పోర్ట్స్ కోటాలో ఎజిబిఎస్‌సిలో సీటు దక్కింది. ఇటీవల ఎంసెట్ కౌన్సెలింగ్‌లో ఆమెకు ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యాన నడుస్తున్న బాపట్ల వ్యవసాయ కళాశాలలో ఎజిబిఎస్‌సిలో చేరేందుకు సీటు దక్కించుకుంది. జిల్లాకి చెందిన పూజిత గత కొన్నేళ్ళుగా ఫెన్సింగ్ క్రీడలో శిక్షణ పొందుతోంది. రాష్ట్ర, జిల్లాస్థాయి పోటీల్లో పలు విభాగాల్లో పతకాలు సాధించింది.

బాధిత కుటుంబానికి వైఎస్‌ఆర్ బీమా

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్చాపురం మున్సిపాలిటీ పురుషోత్తపురం సచివాలయం పరిధిలో 2వ వార్డు నందు నివసిస్తున్న లికాతిల మోహనరావు అనే వ్యక్తికి రోడ్డు ప్రమాదంలో ఆయన ఎడమ చేతిని కోల్పొయారు. బాధితుడికి వైఎస్ఆర్ బీమా తరుపున పాక్షిక అంగవైకల్యం కింద రూ.5లక్షలు భీమా మంజూరు చేయడం జరిగింది. మంజూరైన రూ.5లక్షలు చెక్‌ని మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజలక్ష్మి చేతుల మీదుగా శుక్రవారం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమకుమార్, 2వ వార్డు ప్రతినిధి చాట్ల తిరుపతి, టౌన్ ప్రెసిడెంట్ ప్రకాష్ పట్నాయక్, కొంతల రామ్మూర్తి, దనపన కేశవ, రత్నాల ఢిల్లీ, సిహెచ్ కష్ణ, పప్పల గిరి, డి.మాధవ్, డి.కృష్ణ, డి.జగన్, ఎన్.కృష్ణమూర్తి, సచివాలయ అడ్మిన్ దయాకర్, వెల్ఫేర్ సెక్రటరీ సుజిత్, వాలంటీర్లు పాల్గొన్నారు.